## క్లుప్తంగా

### సీఎస్ఐ చర్చి ఆరాధనలో ఎమ్మెల్యే డీఎన్నార్



**మండవల్లి:** మండలంలోని తక్కెళ్లపాడు సీఎస్ఐ చర్చి 21వ ప్రతిష్ట వార్షికోత్సవ ఆరాధన కార్యక్రమంలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ (రాము) సర్పంచ్ చేబ్రోలు సుధారాణి, పీఏసీఎస్ అధ్యక్షులు కాలి మోషే, రెవరెండ్ కావుదాసి సురేష్, వల్లూరి రత్నరాజు, చేబ్రోలు సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### సంపద తయారీ కేంద్రం పరిశీలన



**మండవల్లి:** మండలంలోని తక్కెళ్లపాడులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఈఓపీఆర్డీ బి.నందబాబు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరితగతిన కేంద్రం పూర్తిస్థాయిలో పనిచేసేవిధంగా చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం స్పందన అర్జీలు పరిశీలించారు. సర్పంచ్ చేబ్రోలు సుధారాణి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

### పూర్తిస్థాయి ధర చెల్లించాలి

**పామర్రు:** ఆఫ్‌లైన్‌లో బుక్ చేసిన ధాన్యానికి కూడా అధికారులు పూర్తి స్థాయి ధరను చెల్లించి రైతులను ఆదుకోవాలని ఏపీ కౌలు రైతు సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు కోరారు. స్థానిక సీఐటీయు కార్యాలయంలో కౌలు రైతు సంఘ జిలా నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని ఆఫ్‌లైన్ ధాన్యం బుకింగ్ సమస్య కృష్ణా జిల్లాలోనే ఉన్నదని తెలిపారు. గతంలో ఆన్‌లైన్ సమయం పూర్తి అయిన తర్వాత రైతులు నూర్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని జిల్లా అధికారులను కోరినప్పుడు మీ ధాన్యాన్ని మీకు ఇష్టం మైన మిల్లులో ఆర్‌బీకేల ద్వారా ఆఫ్‌లైన్‌లో బుక్‌చేసుకోవాలని జిల్లా అధికారులు రైతులకు చెప్పటం జరిగిందని పేర్కొన్నారు. జిల్లా సంఘ అధ్యక్షుడు కె.శివ నాగేంద్ర, కార్యదర్శి పంచకర్లరంగారావు, స్థానిక నాయకులు కాటూరి నాగ భూషణం, ఒడుగు గంగాధర ప్రసాద్ పాల్గొన్నారు.

### ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్‌గా వెంకటరత్నం

**మొవ్వ:** ఎమ్మార్పీఎస్ పామర్రు నియోజకవర్గ కన్వీనర్, కో-కన్వీనర్‌లుగా కనగాల వెంకటరత్నం మాదిగ, ఉడుముల సికిందర్ మాదిగలు నియమితులయ్యారు. ఈ మేరకు కూచిపూడిలో శుక్రవారం జిల్లా కన్వీనర్ కొల్లూరి రామాంజనేయులు మాదిగ, కో కన్వీనర్ చోడవరపు వెంకటేశ్వరరావు మాదిగలు నియామక ఉత్తర్వులు అందచేశారు. మండల కమిటీలు ఏర్పాటు చేసి ఎమ్మార్పీఎస్ బలోపేతానికి, ఎస్సీ వర్గీకరణ దిశగా ముందుకు సాగుతామని వెంకటరత్నం తెలిపారు. నాయకులు బొడ్డు కిషోర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

### బాటసారులకు మజ్జిగ పంపిణీ



**గుడివాడ టౌన్:** వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ పిలుపు మేరకు పట్టణ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో 30 రోజుల మజ్జిగ పంపిణీ కార్యక్రమం శుక్రవారం స్థానిక మెయిన్ రోడ్‌లోని శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానం వద్ద జరిగింది. మారం హనుమంతరావు సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్లబ్ పూర్వ అధ్యక్షుడు దోసపాటి హరిప్రసాద్, అధ్యక్షుడు తిరివీధి వెంకట సుబ్బారావు, కార్యదర్శి సీహెచ్ సుధీర్, కోశాధికారి ఎక్కలి మణిదీప్, క్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

### నేడు గడప గడపకు మన ప్రభుత్వం

**గుడివాడ టౌన్:** గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం ఉదయం 10 గంటలకు 3వ వార్డులోని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను ఇంటి వద్ద నుంచి ప్రారంభిస్తారని ఆ పార్టీ నాయకులు శుక్రవారం తెలిపారు. గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని), అన్ని శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వార్డు వలంటీర్లు పాల్గొంటారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

### రేపు ఆర్టీసీ డిపో ప్రారంభం

**గుడివాడ టౌన్:** కోట్లాది రూపాయలతో నిర్మించిన గుడివాడ ఆర్టీసీ డిపో ఆదివారం ప్రారంభం కానుంది. గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, మాజీ మంత్రులు, ప్రజా ప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు పాల్గొంటారని డిపో మేనేజర్ జి.రాజేష్ కుమార్ తెలిపారు.

# జగనన్న పాలనలో అన్ని వర్గాలకు మేలు

- జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి విశేష స్పందన
- ఎమ్మెల్యే డీఎన్నార్



కైకలూరులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

**కైకలూరు/మండవల్లి:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు మేలు చేకూరిందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. ప్రజా సంక్షేమ పాలనను వివరిస్తూ కొనసాగుతోన్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని చెప్పారు. కైకలూరు 1,5 సచివాలయాలు, మండవల్లి మండలం నందిగామలంకలో జరిగిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాల్లో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజా సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రతి కుటుంబానికి మేలు చేస్తున్న సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. ఇంటి తలుపులు, సెల్‌ఫోన్లపై జగన్ స్టిక్కర్‌ను గృహసారథులు అతికించారు. ఈ కార్యక్రమంలో కైకలూరు, మండవల్లి మండలాల ఎంపీపీలు అడడి కృష్ణ, పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, మండవల్లి జెడ్పీటీసీ సభ్యురాలు ముంగర విజయనిర్మల, ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ సేవాదళ్ కన్వీనరు మోరు నాగరాజు, సర్పంచులు దానం మేరి నవరత్న కుమారి, నేతల నాగరాజు, ఎంపీటీసీ సభ్యులు మూడేడ్ల శశికళ, మోరు వెంకటరమణ,



మండవల్లి మండలం నందిగామలంకలో పాల్గొన్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

నాయకులు తోట మహేష్, జంపన కొండరాజు, షేక్ రఫీ, దండే రవి ప్రకాష్, మోరు శ్రీను, ఎస్ డీ.భాష, కరేటి రాంబాబు, మూడేడ్ల గౌరీ నాయుడు, మానుకొండ సత్యనారాయణ, తలారి సత్యనారాయణ, నిడుమోలు శ్రీనివాసరావు, సాంబశివరావు, బుర్ల సత్యనారాయణ, అనుపోజు రామకృష్ణ, యక్కలి లక్ష్మీదీపక్, భూపతి ప్రవీణ్ కుమార్, బొల్లారపు లక్ష్మీకాంత్, కుర్మా సీతయ్య, తటపర్తి తాతయ్య, కుర్మా నాగేశ్వరరావు, నిమ్మగడ్డ అమర్తయ్య, చిట్టిబాబు, నేతల సిలువు, పరిసే వెంకటేశ్వరరావు, వంగలపాటి సుబ్బారావు, భూపతి వరప్రసాద్ పాల్గొన్నారు.

## మహిమాన్వితుడు భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి

**మే ఒకటి నుంచి 6వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు**



మల్లేశ్వరస్వామి ఆలయం



భ్రమరాంబ సమేత చెన్న మల్లేశ్వరస్వామి

**ఎలకుర్రు(పామర్రు):** మండల పరిధిలోని ఎలకుర్రు గ్రామంలో వేంచేసియున్న భ్రమరాంబ సమేత చెన్న మల్లేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు మే నెల ఒకటో తేదీ నుంచి 6 వరకు నిర్వహించ తలపెట్టారు. ఈ మేరకు ఆలయాన్ని రకరకాల రంగులతో అలంకరిస్తున్నారు. ఆలయంలోని హరికథా కాలక్షేప పండపాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆలయ కమిటీ సభ్యులు పనులు పర్యవేక్షిస్తున్నారు. బ్రహ్మోత్సవాలు అత్యంత రమణీయంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నారు. కోరుకున్న వారికి కొంగు బంగారమై భక్తుల పాలిట కల్పవృక్షంగా ఉంటూ కోర్కెలను తీరుస్తున్న కరుణా సముద్రుడు భ్రమరాంబా సమేత చెన్న మల్లేశ్వరస్వామి. రెండు శతాబ్దాలకు పైబడి భ భక్తులచే పూజలు అందుకుంటూ గ్రామస్తుల ఇలవేల్పుగా కొలువై ఉన్నారు. ఆలయ 263 వ వార్షిక కళ్యాణ మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక కుటుంబ ధర్మకర్త కాశీనాధుని నాగేశ్వరరావు గురువారం తెలిపారు. తొలిరోజు లింగధారణ, ధ్వజారోహణం , వై.పూర్ణచంద్రరావు బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శనలు, చిన్నాపురం జన్ను నారాయణరావు సమర్పించు హరిశ్చంద్ర నాటక ప్రదర్శనలు ఉంటాయన్నారు. 2 న వేద పఠనం, సహస్రనామార్చన, రాత్రి 9 గంటలకు పసుమర్తి శ్రీనివాస శర్మ సమర్పించు భామా కలాపం నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. మే 3 న హరికథా కాలక్షేపం, రాత్రి 7 గంటలకు విశ్వదాత కల్చరల్ ఫౌండేషన్ వారిచే శిశ్వదాత అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుందని చెప్పారు. పలు రంగాలల్లోని వ్యక్తులకు అవార్డులు ప్రదానం చేస్తామన్నారు. 4వ తేదీన వేదపఠనం, రాత్రి 7గంటలకు జగజ్యోతి, రాత్రి 9 గంటలకు గయోపాఖ్యాన(వార్ సీన్), రామాంజనేయ యుద్ధం , సుయోధన మయసభ ఉంటుందన్నారు. అర్ధరాత్రి 2గంటలకు స్వామివారి కళ్యాణ మహోత్సవం ఉంటుందన్నారు. మే 5న 10 గంటల నుంచి సాయింత్రం 6గంటలకు హరికథా కాలక్షేపములు ఉంటాయన్నారు. రాత్రి 10 గంటల నుంచి స్వామివారి రథోత్సవం, మే 6వ తేదీన స్వామివారి త్రిశూల స్నానం, రాత్రికి ఏకాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ అనంతరం మహా అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

### సచివాలయాల్లో రికార్డుల తనిఖీ



**గుడివాడ టౌన్:** సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ అన్నారు. నాగవరప్పాడు-1, 33వ వార్డు సచివాలయాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. సంక్షేమ పథకాలు, పర్సనల్, సెలవు రిజిస్టర్లు, కార్యాలయ రికార్డులు పరిశీలించారు. అనంతరం సచివాలయ కార్యదర్శులతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సచివాయ ఉద్యోగులు ప్రజలకు దగ్గరగా ఉండాలని సూచించారు. విధి నిర్వహణలో, సమయపాలనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### మేడే పోస్టర్ ఆవిష్కరణ

**మండవల్లి:** మేడే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి పిలుపునిచ్చారు. స్థానిక శిశు సంక్షేమ శాఖ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి శుక్రవారం మేడే పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి చెల్లమ్మ, అంగన్వాడీ కార్యర్తల లీడర్లు వాణి, ఉమాదేవి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు అగ్రతాంబూలం

**ముదినేపల్లి రూరల్:** రాష్ట్రంలోని జగనన్న ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులకు అగ్రతాంబూలం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. మండలంలోని కొరగుంటపాలెం శివారు సీతారామపురంలో అంగన్‌వాడీ భవనం, వణుదుర్రు జగనన్న కాలనీలో అంతర్గత రోడ్లు, చేవూరులో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడుతూ విద్యతో పాటు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే ప్రతి సచివాలయ పరిధిలో పేదల ముంగిట ఆరోగ్య సేవలందించేందుకు విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేయడంతో పాటు జగనన్న కాలనీల్లో రహదారుల అభివృద్ధి, విద్యుదీకరణ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రతి పేద కుటుంబం సుఖఃసంతోషాలతో విలసిల్లాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అందుకనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా సచివాలయాల పరిధిలో మంజూరైన నిధులతో వణుదుర్రు పంచాయతీ అభివృద్ధి పనులు చేపట్టి సకాలంలో పూర్తిచేయడం అభినందనీయమన్నారు. చేవూరులో ఆరోగ్యకేంద్ర భవనాన్ని సైతం సత్వరమే పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన పార్టీ స్థానిక నేతలను అభినందించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, సర్పంచ్‌లు పేరే రామకృష్ణ, ఈడే నాగమణి, వల్లభనేని లక్ష్మీ, అబ్బిశెట్టి వెంకటేశ్వరరావు, వైస్‌ఎంపీపీ రాచూరి రాధా, వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షుడు మోత్రు ఏసుబాబు, నాయకులు అచ్యుత రాంబాబు, బండి శివాజీ, షేక్ అల్లాభక్షు, కోమటి విష్ణువర్ధన్, బొర్రా శేషుబాబు, ఈడే వెంకటేశ్వరరావు, గంటా కోటేశ్వరరావు, బండి నాగబాబు, నారయ్య, రాంబాబు, దివి సతీష్, ఎంపీడీవో పీ మల్లీశ్వరీ, ఎమ్మార్వో కే శ్రీనివాస్ పాల్గొన్నారు.



అంగన్‌వాడీ భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

## పామర్రులో ఉపాధి పనులు ప్రారంభం



ఉపాధి పనులను ప్రారంభిస్తున్న గ్రామ సర్పంచ్ కేతావతు కస్తూరి

**పామర్రు:** జాతీయ గ్రామీణ ఉపాధి పనులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని గ్రామ సర్పంచ్ కేతావతు కస్తూరి అన్నారు. గ్రామంలోని వీరాంజనేయస్వామి దేవాలయం దగ్గరలో ఉన్న పంట బోదె పూడిక తీత పనులను సర్పంచ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువతకు ఎంతో ఉపాధి కలుగుతోందని తెలిపారు. గ్రామంలో 220 మంది ఉపాది కూలీలలో పంట బోదెల పూడిక తీత పనులు చేపట్టామని పేర్కొన్నారు. కూలీల నమోదులో అవకతవకలకు పాల్పడకుండా ఫీల్డు అసిస్టెంట్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వేసవిలో వారికి తాగునీరు, నీడ సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఏపీవో పోలు రాజు మాట్లాడుతూ మండల పరిధిలోని 25 గ్రామ పంచాయతీలలో 3,200 మంది పనులలో పాల్గొన్నారని చెప్పారు. వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి, విజయవాడ కృష్ణా మిల్క్ యూనియన్ జిల్లా బోర్డు డైరెక్టర్ బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, మండల రైతు సలహామండలి అధ్యక్షులు ఆరుమళ్ల శ్రీనాధ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రూ.2.56 లక్షలతో చెరువు పనులు



**మండవల్లి:** ఉపాధి హామీ పనులు కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంటీపీ నవీన్ పేర్కొన్నారు. మండలంలోని చావలిపాడులో రూ. 2.56 లక్షలతో బాబూరావు గుంట చెరువు పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పనుల్లో శుక్రవారం 112 మంది కూలీలు పాల్గొన్నారని చెప్పారు. ఈ పనుల ద్వారా కూలీలకు ఉపాధి లభించడంతోపాటు, రైతుల సాగునీటి సమస్యలు తీరుతున్నాయని తెలిపారు. పశువులకు తాగునీటి కొరత తీరుతుందని పేర్కొన్నారు.

# మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

- మంత్రి ఆర్‌కే రోజా
- మచిలీపట్నం మెడికల్ కళాశాల సందర్శన



మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి మెడికల్ కళాశాల పనులను పరిశీలిస్తున్న మంత్రి ఆర్కే రోజా

**కోనేరుసెంటర్:** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర యువజన వ్యవహారాలు, పర్యాటక, సాంస్కృతిక, క్రీడల శాఖా మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. దీనిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలు నిర్మించి వాటికి అనుసంధానంగా ఆస్పత్రులు నిర్మిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల ఆదిత్య రామయ్య, ఎమ్మెల్యేలు పేర్ని వెంకట్రామయ్య (నాని), కొడాలి నాని, వల్లభనేని వంశీ, కొలుసు పార్థసారథి, సింహాద్రి రమేష్, కైలే అనిల్‌కుమార్‌లతో కలిసి మచిలీపట్నంలోని మెడికల్ కళాశాల నిర్మాణ పనులను శుక్రవారం ఆమె పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ లైబ్రరీ పనులను పరిశీలించారు. పనుల పూర్తిపై ఆరా తీయగా మరో 15 రోజుల్లోగా కొన్ని బ్లాక్‌లకు సంబంధించిన పనులు దాదాపు పూర్తి చేస్తామని అధికారులు ఆమెకు తెలిపారు. మంత్రి రోజా మాట్లాడుతూ మెడికల్ కళాశాల పనులు ఊహించని స్థాయిలో జరుగుతున్నాయన్నారు. చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండి చేయలేని మెడికల్ కళాశాల నిర్మాణ పనులను తాను ముఖ్యమంత్రి అయిన నాలుగేళ్లలో చేసి చూపిస్తున్న ముఖ్యమంత్రి మన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. రాష్ట్రం పట్ల, రాష్ట్ర ప్రజల పట్ల ఆయనకు ఉన్న అభిమానం, రాష్ట్రాభివృద్ధి కోసం ఆయన పడుతున్న కష్టాన్ని ప్రజలు చూస్తున్నారని చెప్పారు. ఈ విషయాన్ని ప్రతిపక్షం గ్రహించాలన్నారు. కొన్ని పత్రికల్లో మెడికల్ కళాశాల నిర్మాణంపై అసత్య కథనాలు రాయించడం సహేతుకం కాదన్నారు. నంధ్యాల, ఏలూరు, విజయనగరంలకు మొదటి సంవత్సరం కోర్సులు ప్రారంభించేందుకు అనుమతులు వచ్చాయని చెప్పారు. కృష్ణాజిల్లాకు రెండు ఇన్‌స్పెక్షన్లు జరిగాయన్నారు. మచిలీపట్నం మెడికల్ కళాశాలకు మరో రెండు రోజుల్లో అనుమతులు వస్తాయన్నారు. నెలాఖరులోగా పనులు దాదాపు పూర్తి చేయాలని మెగా కంపెనీకి ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. కళాశాల నిర్మాణ పనులు ప్రారంభించిన రెండేళ్లలోనే మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభించేందుకు సిద్ధం అవుతున్నా యంటే అది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొప్ప తనమేనని వివరించారు. వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు లంకా సూరిబాబు, తంటిపూడి కవితా నోబుల్, ముడా చైర్మన్ బొర్రా నాగదుర్గాభవాని, డీఆర్వో వెంకటేశ్వర్లు, బందరు ఆర్డీఓ ఐ. కిషోర్, తహసీల్దార్ డి. సునీల్‌బాబు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మంత్రి రోజాకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ రాజాబాబు చిత్రంలో పేర్ని

**మంత్రి రోజాకు ఘన స్వాగతం..**

**చిలకలపూడి(మచిలీపట్నం):** జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆర్‌కే రోజాకు శుక్రవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఘనస్వాగతం లభించింది. అతిథిగృహంలో ఆమె పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కలెక్టర్ పి. రాజాబాబు, ఎస్పీ పి. జాషువా, జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా, ఎంయూడీఏ చైర్మన్ బొర్రా నాగదుర్గాభవాని, డెప్యూటీ మేయర్లు లంకా సూరిబాబు, తంటిపూడి కవిత పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి జోగి రమేష్, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యేలు పేర్ని నాని, కొడాలి నాని, కొలుసు పార్థసారథి, వల్లభనేని వంశీ తదితరులు కొద్దిసేపు మంత్రి రోజాతో ముచ్చటించారు.

### ఇటువంటి స్ఫూర్తే కావాలి

**కృత్తివెన్ను జెడ్పీటీసీని సత్కరించిన మంత్రి జోగి రమేష్**



జెడ్పీటీసీ రత్నకుమారి దంపతులను సత్కరిస్తున్న మంత్రి జోగి రమేష్

**కృత్తివెన్ను:** పార్టీ ఆదేశాలను కృత్తివెన్ను జెడ్పీటీసీ మైల రత్నకుమారి చిత్తశుద్ధితో అమలు చేసి పలువురికి స్ఫూర్తిగా నిలిచారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ఆమె కృత్తివెన్ను పంచాయతీలో 1500లకు పైగా గృహాలను సకాలంలో సందర్శించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారన్నారు. ఇదే విధంగా ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను సకాలంలో నిర్వహించాలని సూచించారు. రత్నకుమారితో పాటు ఆమె భర్త రమేష్‌ను మంత్రి శుక్రవారం తన కార్యాలయంలో శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. మంత్రి తనయుడు జోగి రాజీవ్, పడతడిక సర్పంచ్ ప్రదీప్‌కుమార్, స్థానిక నాయకులు జయరాజు, జోజిబాబు, వీరబాబు పాల్గొన్నారు.

### నూరు శాతం రుణాలు చెల్లింపు

**కైకలూరు:** ఆక్వా రైతులకు అందించిన రుణాలను పూర్తిస్థాయిలో వసూలు చేసిన ఘనతను కలిదిండి మండలం తాడినాడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) సాధించింది. ఈ సందర్భంగా సంఘ చైర్‌పర్సన్ సాగి వెంకట సూర్యనారాయణరాజు, సంఘ సీఈవో వేగేశ్న సుబ్బరాజు శుక్రవారం మాట్లాడుతూ సంఘంలో 298 మంది ఆక్వా రైతులకు 2022-23 సంవత్సరానికి స్వల్ప కాలిక చేపల చెరువు సాగు మేతల నిమిత్తం రుణంగా రూ.6,83,26,000 అందించామన్నారు. రైతులు అసలు, వడ్డీతో కలిపి పూర్తిగా చెల్లించారని తెలిపారు. ఈ సందర్భంగా కేడీసీసీ సిబ్బంది అభినందించారని తెలిపారు. ఏటా రుణాల వసూలులో ప్రథమస్థానం సాధిస్తున్నామని చెప్పారు.

### జ్వరాలపై సర్వే నిర్వహించండి

**చిలకలపూడి(మచిలీపట్నం):** క్షేత్రస్థాయిలో జ్వరాల బారిన పడిన వారి వివరాలను తెలుసుకునేందుకు సర్వే నిర్వహించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జి. గీతాబాయి అన్నారు. ఆమె కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అనుమానిత వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి తగిన మందులు అందజేయాలని సూచించారు. ప్రజల్లో కీటక జనిత వ్యాధులపై అవగాహన కల్పించి నివారణ చర్యలు చేపట్టేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా అవ్వా, తాతలకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరాన్ని బట్టి కళ్లజోళ్ల పంపిణీ, కంటి శుక్లాల శస్త్రచికిత్సలు చేయించాలని చెప్పారు. పుట్టినబిడ్డ నుంచి అర్హులైన వారందరికీ వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో అందించాలన్నారు. డీఈఓ డాక్టర్ శర్మిష్ట, బి. రామారావు, బి. శివసాంబిరెడ్డి, రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### పరివర్తన చెంది జీవించాలి



కైకలూరు సబ్‌జైల్‌లో ఖైదీల నుంచి కేసు వివరాలు తెలుసుకుంటున్న జడ్జి నాగలక్ష్మి

**కైకలూరు:** వివిధ కేసుల్లో జైలు జీవితం గడుపుతున్న వ్యక్తులు పరివర్తన చెంది తిరిగి కుటుంబాలతో సుఖసంతోషాలతో చక్కటి జీవనం కొనసాగించాలని కైకలూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కె.నాగలక్ష్మి (ఎఫ్ఏసీ) చెప్పారు. కైకలూరు సబ్‌జైలును ఆమె ఆకస్మిక తనిఖీ శుక్రవారం చేశారు. జైలులో ఖైదీలకు అందుతున్న ఆహారంపై ఆరా తీశారు. ఒక్కొక్కరి కేసులను వారి మాటల్లో తెలుసుకున్నారు. అనంతరం తాలూకా లీగల్ సర్వీసెస్ కమిటీ ద్వారా న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ప్రతి ఒక్కరూ కనీస చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఆర్థిక స్థోమతలేని ఖైదీలకు ఉచిత న్యాయవాదిని సమకూర్చే వెసలుబాటు ఉందన్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంటు బొత్స అప్పారావు, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు ఎంవీవీ.సత్యనారాయణ, ఉపాధ్యాక్షులు ఎంఎస్ఎస్.రాజు, న్యాయవాధులు పి.పవన్‌కాంత్, డి.శివప్రసాద్ పాల్గొన్నారు.